# చింతచిగురు

ఆకలి రంగు చర్మాల్లో రెండెముకలగూళ్ళు నిర్జనమైన మాడుతున్న రోడ్డుమీద వారంట తూలుతూ నడుస్తున్నాయి. దరిద్రాన్ని కట్టుకొన్న, తెగమాసిన ఒకగూడు ఆడదానిలా కనబడుతున్నాది. నిరాశనీ మూలుగునీ మోసుకొంటూ ఆడగూడుపక్క నడుస్తున్న, బతుకుచస్తూన్న కళేబరం మొగదానిపోలికలతో కుంటుతున్నాది. కొలిమిలాంటి సూర్యుడిలోంచి బాగా కాలిన యినపపూచల్లాంటి కిరణాలు నుదుటిమీద గుచ్చబడుతున్నాయి.

దారికి రెండుపక్కలా ఎలక్ట్రిక్ స్తంభాలు, టెలిగ్రాఫు స్తంభాలు వరుసగా నిలుచున్నాయి. టెలిగ్రాఫు స్తంభాల్లో కనిపించిన గాడ్పు ఓంకారనాదం చేస్తున్నాది. ఎలక్ట్రిక్ స్తంభాల ఒంటికళ్ళు జాలిగా తెల్లగా శూన్యాన్ని పరీక్షిస్తున్నాయి. దారికి ఇరుపక్కలా శ్మశానం అంత ఎడారిలాంటి బయలు క్షణ క్షణానికి వి స్తరించుతున్నాది.

ఎముకలగూళ్ళు ఎక్కడనుంచి ఎక్కడికి ఎందుకు ప్రయాణం చేస్తున్నారో చెప్పుకోడం బహుసులభం. ఆ ఆకలిరంగు చర్మాలేవాళ్ళు అడుక్కుందుకు బయలుదేరారని అడక్కుండా చెప్తాయి. ఇద్దరూ ఒకరిమీద ఒకరు ఆనుకొంటూ అతి కష్టంమీద అడుగుతీసి అడుగు వేస్తున్నారు. మొగాడి చేతులోని ఊతకర్ర రోడ్డుని కొలుస్తున్నాది.

గాడిపొయ్యిలాగ రోడ్డు సెగలు చిమ్ముతున్నాది. ఏ నాటికి ముగుస్తుందో ఈరోడ్డుమీద జంగేవంట. పకడుపులు

నింపేందుకు జరుగుతున్నాదో ఊవంట. ఇద్దరూ సోలుతూ నడుస్తున్నారు. ఇద్దరూ తూలుతూ సాగుతున్నారు; ఇద్దరూ నీరసంగా భూమిలోకి కుంగిపోతున్నారు.

దారిఅంచుమీద జారుతూ నడుస్తున్నారు.

దారిఅంచుమీద జారుతూ నడుస్తున్నారు; కంకర రాళ్ళమీద గుండం తొక్కుతున్నారు; ఎవరో ముందుకు తోస్తూవుంటే ఆశతో సాగుతున్నారు; ఏదో వెనక్కు లాగేస్తూవుంటే బాధతో ఆగిపోతున్నారు, మళ్ళా ఎవరో నెట్టుతూవుంటే పచ్చతనాన్ని ఆలోచించుకొంటూ ముందుకు అడుగేస్తున్నారు.

ఇద్దరిలో ఒకరు మాట్లాడడం లేదు వాళ్ళ నాలికలు చాలాకాలంనుంచి యుగయుగాలనుంచి పిడచకట్టుకు పోయాయి. ఎండిపోయిన దిగుడుబావుల్లాంటి వాళ్ళగొంతుకలలో నరాలు ఏ స్వరాలనీ పలకడం లేదు. నాలికమీద ఆకలి వాయించే మాటలు హరించుకుపోతున్నాయి. ఆడగూడు నాలికని మీద పెదవిమీదుగా పోనిచ్చి తడిచేసుకుంది; చేసుకున్నట్టు అనుకుంది. మొగాడు భుజంమీద జారుతున్న జోలెని ఎగసన తోసుకొన్నాడు. ఇద్దరూ మాట్లాడకుండా నడుస్తున్నారు.

రోడ్డుకి ఇరుపంచలా ఉన్న కుక్కగొడుగులాంటి వృక్షరాసి ఉన్నా లేనట్టేవుంది. ఎంతదూరం నడిచారో చెప్పడం కష్టం. ఊతకర్రకూడా మాగిదయింది. కనుచూపు మేరలో ఒక చింతచెట్టు మాత్రం అభయహస్తాలని

నాలుగుప్రక్కలా చాపి ఏడుకొండలవాడి పోజులో రాదారి పోలీసువాడిలా నించుంది. ఈ ముష్టివాళ్ళ గమ్యస్థానం ఆ దేవని సులువుగా పోల్చుకోవచ్చు.

కిందామీదా పడుతూ ఇద్దరూ చెట్టుకిందకి చేరుకొన్నారు. చెట్టుకింద చేటంత నీడలో కూలబడ్డారు. ఇద్దరూ ఒకేసారి నిట్టూర్చారు. వేడిగా ఒక చెమటబొట్టూ, ఒక కన్నీటిచుక్కా రాల్చారు. మగ ఆకారం జోలెలోంచి ఒక సీసా తీసింది. కొన్నాళ్ళకిందట అతి విలువైన సీమ చేపనూనె ఆ సీసాలో కూర్చొని ఈ దేశంలో దిగింది. ఈ సీసాలో నీళ్ళు పట్టి కాగితం మూతపెట్టి ఇద్దరూ దాచుకున్నారు. మొగాడు బుడ్డితీసి గొంతు తడుపుకున్నాడు; నీళ్ళు వేడెక్కిపోయాయి. సీసాని ఆడదానికి అందిచ్చాడు.

ఎండకి వెరచిన కాకొకటి చెట్టుమీదకొదలి ఒక ఎండు చొట్టని రాల్చింది. అది సమంగా ఆడదానిఒళ్లో పడ్డాది. ఆడది చింతచొట్టని రుచిచూచి ప్రాణాన్ని సర్దుకుంది. మొగాడికి సలహాయిచ్చింది మొగాడు సిటారుగా నిల్చుని చెయ్యి మీదకెత్తాడు, కొమ్మ అందుకురాలేదు ఊతకర్రతో చిగురుని కదిపాడు. జీర్ణించి పోతున్న సత్తువని కూడదీసుకుని పూరాగా కొమ్మని కొట్టాడు, కొంత చిగురురాలింది. ఆడదాన్ని తినమన్నాడు, ఆడది రెండు చిరు ఆకుల్ని నాలిక మీద పెట్టుకొని చప్పరించింది. తలవూపి చిగురంతా రెండు చేతులా తీసుకొని నోట్లో కుక్కుకుంది, అతివేగంతో నమిలింది

మొగాడు మరి ఒక ఆకేనా రాల్చలేక పోయాఁడు; మొదలు తెగిన చెట్టులా కూలిపోయాడు. మూర్ఛ లక్షణాలు మొగంమీద పచార్లు చేస్తున్నాయి. ఆడది సీసాలో నీళ్ళని వాడి మొగంమీద జల్లబోయింది, మొగాడు కళ్ళు విప్పకుండా ఆడదాన్ని ఆ నీళ్ళు తాగమని సంజ్ఞ చేశాడు. వడ్ర కన్నీళ్ళు రాల్చేందుకు సరిపోయిన సత్తువ ఆడదానిలో ఉంది.

---